

# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త




## కుప్పంలో బెంగళూరు - నర్సాపురం రైలుకు స్టాపింగ్ ఇవ్వాలి : ప్రతిపక్ష నేత చంద్రబాబు

**- దక్షిణ పశ్చిమ రైల్వే జిఎం.. డిఆర్ఎంకు లేఖ !!**



కుప్పం, డిసెంబర్ 6 ప్రభాతవార్త

కర్ణాటక రాజధాని బెంగళూరులోని సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య టెర్మినల్ నుంచి పశ్చిమగోదావరి జిల్లా నర్సాపురం వరకు నడిచే రైలు (నెం07154/07153)కు కుప్పంలో స్టాపింగ్ కేటాయించాలని కోరుతూ దక్షిణపశ్చిమ రైల్వే జనరల్ మేనేజర్, డివిజనల్ మేనేజరుకు ప్రతిపక్ష నేత, మాజీ సిఎం చంద్రబాబునాయుడు లేఖ రాశారు. కుప్పం ప్రాంతం కర్ణాటక, తమిళనాడురాష్ట్రాలకు సమీపంలో ఉండడంతో పాటు ఇక్కడ ద్రవిడ విశ్వవిద్యాలయం, మెడికల్, ఇంజనీరింగ్ కాలేజ్ తదితర విద్యాసంస్థలు ఉన్నాయన్నారు. అలాగే కుప్పం ప్రాంతం వివిధ రకాల వ్యవసాయ ఉత్పత్తుల కేంద్రంగా ఉన్న నేపథ్యంలో ప్రజలు, విద్యార్థులు, రైతుల సౌకర్యార్థం కుప్పంలో ఎంఎస్విటి - నర్సాపురం రైలుకు కుప్పంలో స్టాపింగ్ కేటాయించాలని లేఖలో పేర్కొన్నారు.

## అంధకారంలో గ్రామాలు

**తుఫాన్‌తో విద్యుత్ స్తంభాలు, భారీ వృక్షాలు నేలమట్టం**
**నీట మునిగిన వరి నారుమడులు**
**సహాయ చర్యలు చేపడుతున్న అధికారులు**




తుఫానుకు కుప్పకూలిన జామల చెట్లు, విద్యుత్ స్తంభం విరిగి పడిన దృశ్యం

చిల్లకూరు, డిసెంబర్ 6, ప్రభాతవార్త

చిల్లకూరు మండలంలోని లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. అయితే గూడూరు ఆర్డీవో కిరణ్ కుమార్ డిఎస్పి సూర్యనారాయణ రెడ్డి తహశీల్దార్ కె. శ్రీనివాసులు, ఎంపిడిఓ వెంకట సూర్య సాయి, స్పెషల్ ఆఫీసర్ చెన్నయ్య ఆధ్వర్యంలో అధికారులు అందరూ అప్రమత్తమై ఆయా గ్రామాల్లో పర్యవేక్షిస్తున్నారు. అయితే పలమల, వల్లిపేడు మరికొన్ని గ్రామాల్లో సుమారుగా 50 విద్యుత్ స్తంభాలు నెలమట్టమైనాయి. గ్రామాల్లో ఈదురుగాలులు ఎక్కువగా వేయడంతో చెట్లు విద్యుత్ వైర్లు పై పడిపోవడంతో నేలకొరిగాయి. అదే విధంగా భారీ చెట్లు పడిపోవడం జరిగింది. అదే విధంగా ఉడతవారిపాలెం వెళ్ళి మార్గమధ్యంలో ఫారెస్ట్‌లో ఉన్న జామలచెట్లు తోటలన్నీ పూర్తిగా నేలమట్టమైంది. మండలంలోని అన్ని గ్రామాల్లో కరెంటు లేక అంధకారంలో మగ్గుతున్నాయి. నారుమడులు వరిపైర్లు, నీట మునగడం, నిమ్మతోటలో, అరటి తోటలో నేలమట్టమైనాయి. రైతులు లబోదిబోమంటున్నారు. పారిచర్ల వారిపాలెం వద్ద వరద ఎక్కువగా ప్రవహించడంతో రాకపోకలు స్తంభించాయి. విద్యుత్ శాఖ ఏఈ, వారి సిబ్బంది పాటు ప్రత్యేక బృందాలు రావడంతో చెట్లు తొలగించడం విద్యుత్ లైన్లు మరమ్మతులు చేపడుతున్నారు. అదే విధంగా తిప్పగుంటపాలెం 60 గ్రామం సమీపంలో ఉన్న ఉప్పుటేరు వాగు పొంగి ప్రవహించడంతో ఆ గ్రామానికి రాకపోకలు స్తంభించాయి. వరగలే లింగవరం తమ్మిన పట్నం తిప్పగుంట పాలెం, వరగాలి, రెట్టపల్లి తనకు మాల, కడివేడు, రాజలక్ష్మమ్మ కాలనీ, ఎగురాజుపాలెం గ్రామాల్లో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి 600 కుటుంబాల వారికి భోజనం, వసతులు ఏర్పాటు చేయడం జరిగింది. పారిచర్లవారిపాలెం గ్రామం వద్ద కూడా వంతెన పై వరదప్రవాహం రావడంతో సుమారుగా 30 గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. అదేవిధంగా ఓడూరు , పల్లమాల, కోరోవారిపాలెం, రోడ్లు పూర్తిగా తెగిపోవడం జరిగింది. దీంతో రాకపోకలకు ప్రయాణీకులకు ఇబ్బందికరంగా మారింది. తెగపాలెం పోసిన వారి పాలెం గ్రామాలకు బహింకం కెనాల్ కాలువకి వరద ఎక్కువగా రావడంతో అధికారులు ఆగ్రామంలోని ప్రవేశించి భోజన వసతులు ఏర్పాటు చేయడం జరిగింది. ప్రజల బాగోగులు చూస్తున్నారు. రెట్టపల్లి గ్రామంలో చేనేత కార్మికుల ఇళ్లల్లోకి మగ్గం మిషన్ వద్దకి నీటి ప్రవాహంతో ఇబ్బందులు పడుతున్నారు.

# తడను ముంచెత్తిన వరద





తడ ప్రాంతంలో నేలకొరిగిన వరిపైరు, భారీ వర్షాలతో తడ రోడ్ల దుస్థితి ఇది, కాళంగి నది తీరంలో ఇంకా తగ్గని వరద

తడ, డిసెంబర్ 6 ప్రభాతవార్త

మిచౌంగ్ తుపాను పడగ తడ ప్రజల నెత్తి మీద తాండవమాడుతోంది. వర్షం తగ్గినప్పటికీ వరద భయం ఇంకా తగ్గలేదు. కాళంగి నది, పాముల కాలువ, కరిపేటి కాలువ, నెర్రికాలువలు పొంగి తడ పల్లెలపై పడ్డాయి. బుధవారం సాయంత్రం వరకు కాళంగి నది తీరంలో వరద నీళ్లు చుట్టుముట్టి ఉన్నాయి. పాలకుల నిర్లక్షం, అధికారుల అలసత్వం తడ మండల గ్రామాల పైకి వరద నీటి రూపంలో ఎగబాకింది. కాళంగి నది గేట్లు ఒక్కసారిగా ఎత్తేయడంతో కనీవినీ ఎరుగని రీతిలో ఈ నది చుట్టుపక్కల గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. తడ నుంచి సూళ్లూరుపేట, ఆ వైపు తనియాలి వరకు ఈ నీటి ప్రవాహం అంతకంతకు పెరిగి ఒక దశలో పల్లెలు ఏమవుతాయో అన్న భయాందోళన నెలకొంది. ఈ సారి వరదకు దెబ్బతినని గ్రామమే లేదు. పల్లె పట్టణం తేడా లేకుండా వరద ముంచెత్తింది. సూళ్లూరుపేటకు తూర్పు వైపున ఉన్న ఒక చెరువును తెగ్గొట్టడంతో ఆ నీటి ప్రవాహం తడ మండల పల్లెలపై పడింది. చెరువును తెగ్గొట్టకపోతే పట్టణ శివారు మునిగిపోయే ప్రమాదం ఉందని స్థానికులు గుర్తించి ఈ సాహసానికి పాల్పడ్డారు. అయితే ఆ ప్రవాహ ఉధృతి రెండురోజులుగా తగ్గలేదు. ఆ వరద నీళ్లు సైతం తడ మండలంలోని పంట కాలువలపై, చెరువులపై పడింది. దీంతో చెరువులు, పంట కాలువలు తెగిపోయాయి. రోడ్లు ధ్వంసమయ్యాయి. మరోవైపు పాముల కాలువ సమీపంలోని తడ మండల పల్లెలన్నీ ఎటుచూసినా జలమయంగా కనిపించాయి. ఇళ్లలోకి నీళ్లు రాని పల్లె లేదు. అధికారులు సైతం ఆదుకోవడానికి సకాలంలో వెళ్లలేకపోయారు. కేవలం ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు మాత్రమే కొన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపించారు తప్ప మునిగిపోతున్న పల్లెల గురించి పట్టించుకోలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామ సచివాలయాలు ఉన్నప్పటికీ ఏ ఒక్క దానిలోనూ తగినంతమంది అధికారులు లేరు. జలవనరుల శాఖ, విద్యుత్ శాఖ వంటివి చేసేదేమీ లేకపోయింది. ఒరిగిన స్తంభాలు, కూలిన ట్రాన్స్‌ఫార్మర్లతో ఇప్పటికీ అంధకారంలోనే తడ పల్లెలు ఉన్నాయి. చీకటి భయంతో పాటు సాంకేతిక వ్యవస్థ దెబ్బతింది. కనీసం సమాచారం తెలుసుకోవడానికి, అధికారులకు చెప్పుకోవడానికి కూడా సెల్‌ఫోన్ సంబంధాల్లేవు. టవర్లు దెబ్బతిన్నాయి. పట్టణాలు అయితే బావులు లేకపోవడం, నీటి మోటార్లకు విద్యుత్ లేకపోవడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. తాగడానికి కాదు కదా గీహ అవసరాలకు, ఆఖరుకి అన్నం వండుకోవడానికి సైతం నీళ్లు లేని దుస్థితిలో పడ్డారు. దీనికంతా కారణం ప్రకృతే గాని ప్రభుత్వం కాకపోయినా కనీసం ఓదార్పుకు కూడా నోచుకోలేకపోయామని, ఒకవైపు వరద నీరు చుట్టుముట్టినా ఇంటిలోని పాత్రలు సైతం శుభ్రం చేసుకోవడానికి నీళ్లు లేక ఇబ్బందులు పడుతుంటే, ఈ సమస్యలను తెలుసుకునే వారు కరువయ్యారని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం ఎండ కనిపించడంతో ఒకవైపు సంతోష పడుతున్నప్పటికీ మరోవైపు ఇప్పటికైనా ప్రభుత్వం, పాలకులు, అధికార యంత్రాంగం తమ వద్దకు వస్తారేమో అన్న ఆశతో ఎదురు చూస్తున్నారు. ముఖ్యంగా రైతాంగం తమను పంట కోల్పోయిన కారణంగా ఆదుకోవాలని ఎలుగెత్తి కోరుకుంటున్నారు.

**తుఫాన్ బాధిత కుటుంబాలకు**

## అండగా ప్రభుత్వం

**ఒక్కరికి రూ. వెయ్యి, కుటుంబానికి రూ.2500**
**22,635 కుటుంబాలకు నిత్యవసర వస్తువులు: కలెక్టర్ వెంకటరమణారెడ్డి**




తిరుపతి రూరల్, డిశంబర్ 6 ప్రభాతవార్త:

మిచౌంగ్ తుఫాన్ బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి తుఫాన్ ప్రభావిత 8 జిల్లాలకు సంబంధించిన జిల్లా కలెక్టర్లతో బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో ఈ మేరకు బాధిత కుటుంబాలకు అందిస్తున్న సహాయక చర్యలను వివరించారు. తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ జిల్లా యంత్రాంగం ప్రజలకు అండగా నిలిచినట్లు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా ప్రత్యేక అధికారిగా సీనియర్ ఐఏఎస్ అధికారి శ్యామల రావు జిల్లాలో పర్యటించినట్లు వివరించారు. జిల్లాలో తుఫాన్ ప్రభావం 29 మండలాలో, 546 గ్రామాలపై పడిందన్నారు. దీంతో బాధితుల కోసం 84 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి 6478 మందికి ఆశ్రయం కల్పించినట్ల తెలిపారు. ఇందులో వీరికి అల్పాహారం, భోజనం అందించినట్లు తెలిపారు. అదేవిధంగా పునరావాస కేంద్రాల నుండి ఇంటికి వెళ్ళే సమయంలో బాధితులకు ఒక్కరికి రూ.1000/-లు, కుటుంబానికి రూ. 2500/-లు అందజేయడానికి సంబంధిత ఆర్‌డిఓలకు నిధులు విడుదల చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా తుఫాన్ ప్రభావిత కుటుంబాలకు 25 కేజీలు బియ్యం, ఒక లీటర్ వంట నూనె, కంది పప్పు, ఉల్లి, బంగాళ దుంపలు ఒక కేజీ వంతున అందించనున్నట్లు తెలిపారు. తుఫాన్ తీవ్రత నేపథ్యంలో ఈదురు గాలులకు 496 గ్రామాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడినట్లు తెలిపారు. ఇందులో యుద్ధప్రాతిపధికన 291 గ్రామాల్లో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించినట్లు తెలిపారు. బుధవారం సాయంత్రానికి దాదాపుగా విద్యుత్ సేవలు పునరుద్ధరించగలమన్నారు. అయితే కోట-వాకాడు మార్గంలోని 5, 6 గ్రామాలకు రవాణా కష్టతరంగా వున్నట్లు తెలిపారు. ఈ గ్రామాలకు మంచినీటి కొరకు బోర్ల వద్ద జనరేటర్లు, ట్యాంకర్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఆర్ అండ్ బి పరిధిలో 97 కిలోమీటర్లు, పంచాయతీ రాజ్ పరిధిలో 87 కిలోమీటర్లు రోడ్లు దెబ్బతినగా మరమత్తులు చేపట్టినట్లు వివరించారు. ఇరిగేషన్‌కు సంబంధించిన 244 కాలువలు దెబ్బతిన్నట్లు తెలిపారు. విత్తు వేసిన నెల రోజుల్లోనే తఫాన్ ప్రభావంతో 7126 హెక్టార్లు, ఉద్యానవన శాఖకు సంబంధించి మిరప, పూల తోటలు, సుమారు 246 హెక్టార్లలో పంట నష్టం వాటిల్లినట్లు తెలిపారు. పిచ్చాటూరు వద్ద ఆక్వా ఫామ్, క్యాటిల్ షెడ్ దెబ్బతిన్నాయనీ, పలు పశువులు, దూడలు, గొర్రెలు, మేకలు మృతి చెందినట్లు వివరించారు. ఈ సమావేశంలో ఎస్.పి.పరమేశ్వర్ రెడ్డి, డిఆర్ఓ పెంచల కిషోర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లీగల్ సెల్ శ్రీనివాస రావు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## రాజ్యాంగ శిల్పి అంబేద్కర్

**- జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు**



చిత్తూరు, డిసెంబర్ 6 ప్రభాతవార్త:

భారత రాజ్యాంగ శిల్పి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అని జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు పేర్కొన్నారు. జిల్లా సచివాలయంలో బుధవారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ వర్థంతిని పురస్కరించుకొని జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చిత్రపటం, దర్గా సర్కిల్‌లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులుతో పాటు డిఆర్ఓ రాజశేఖర్, జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి, సాంఘీక సంక్షేమశాఖ డిడి డాక్టర్ రాజ్యలక్ష్మి, కలెక్టరేట్ ఎఓ కులశేఖర్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ భీంరావ్ రాంజీ అంబేద్కర్ 1891 ఏప్రిల్ 14న అప్పటి సెంట్రల్ ప్రావిన్స్‌లోని సైనిక స్థావరమైన మౌ(మధ్యప్రదేశ్) గ్రామంలో రాంజీ మలోజీ సాక్పాల్, భీమాభాయ్ దంపతులకు జన్మించారన్నారు.

## జల్సాలకు అలవాటై....

**మళ్ళీ ముగ్గురు విద్యార్థులు పరారీ -విద్యార్థుల ఆచూకీ కోసం దర్యాప్తు వేగవంతం**






తిరుమల, డిసెంబర్ 6ప్రభాతవార్తప్రతినిధి:

బుద్ధిగా చదువుకోవాల్సిన వయసులో జల్సాలకు అలవాటుపడి ....తరగతులకు ధుమ్మాకొట్టి పరారైన ముగ్గురు విద్యార్థుల సంఘటన ఇది. బుధవారం మధ్యాహ్నం ముగ్గురు విద్యార్థులు పాఠశాల నుండి ఇళ్ళకు చేరుకుని నగదుతో పరారవడం కొసమెరుపు. ముగ్గురూ స్నేహితులైన విద్యార్థులు 7వతరగతి చదువుతున్నవారే. తిరుమలలోని ఎస్వీ ఉన్నతపాఠశాల విద్యార్థులు. గతంలోనూ వీరుముగ్గురూ మరో స్నేహితుడి పుట్టినరోజు వేడుకలకు తిరుపతికి దిగి రెండు రోజులు జల్సా చేసి ఆ తరువాత ఇళ్ళకు చేరుకున్నట్లు ఇప్పుడు గుప్పుమంటోంది. బుధవారం మధ్యాహ్నం విద్యార్థులు కనిపించకుండా పోవడంతో రాత్రి తిరుమల 2టౌన్ పోలీసులకు బాధిత తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. తిరుమల ఆర్‌బిసెంటర్‌లో నివాసముంటున్న ఎస్.కృష్ణ, ఎస్.లక్ష్మిల కుమారుడు ఎస్,చంద్రశేఖర్(13), పోలీసు విశ్రాంతి భవనం వెనుకవైపు ఉంటున్న యోగేశ్ కుమారుడు వైభవ్(13),శ్రీవర్ధన్(13)లు ముగ్గురూ బుధవారం ఉదయం ఇళ్ళనుండి ఎస్వీహైస్కూల్‌కు వెళ్లారు. ముగ్గురూ మధ్యాహ్నం నుండి బయటకు వచ్చి నగదుతో తిరుపతికి పరారయ్యారు. విద్యార్థుల తల్లిదండ్రులు వాచ్‌మెన్‌లుగా, చిన్నచిన్న పనులు చేసుకుని పిల్లలను చదివిస్తున్నారు. ఒక్కసారిగా ముగ్గురు విద్యార్థులు కనిపించకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళనతో తిరుమల 2టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తిరుమల 2టౌన్ సిఐ కె.చంద్రశేఖర్ ,ఎస్ఐ సాయినాధచౌదరి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మధ్యాహ్నం 1.30-1.40గంటల మధ్య రాంభగీచా అతిధిగృహాల బస్టాండు నుండి ఆర్టీసి బస్సులో తిరుపతికి దిగినట్లు సిసి కెమెరాల ఫుటేజీ కనుగొన్నారు. తిరుపతిలో ఏడుకొండల బస్టాండులో దిగినట్లు గుర్తించారు. తిరుపతిలోపోలీసులు గాలింపు చేపట్టారు.

**అర్హులందరికీ సంక్షేమ పథకాలు**

## అందించడమే లక్ష్యం

**కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడానికే వికసిత్ భారత్ సంకల్ప యాత్ర**
**జిల్లా వికసిత్ సంకల్ప యాత్ర ప్రత్యేక అధికారి సచింద్రకుమార్ పట్నాయక్**



వికసిత్ భారత సంకల్ప యాత్రపై అధికారులతో సమీక్షిస్తున్న జిల్లా ప్రత్యేక అధికారి, జాయింట్ కలెక్టర్‌లు

చిత్తూరు, డిసెంబర్ 6 ప్రభాతవార్త:

అర్హులైన పేదలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా వికసిత్ భారత్ సంకల్ప యాత్ర చేపట్టడం జరిగిందని వికసిత్ భారత్ సంకల్ప యాత్ర జిల్లా ప్రత్యేక అధికారి, పరిశీలకులు సచింద్రకుమార్ పట్నాయక్ అన్నారు. జిల్లా సచివాలయంలో బుధవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమ నిర్వహణకు సంబంధించి సంబంధిత శాఖల జిల్లా అధికారులతో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర జిల్లా ప్రత్యేక అధికారి సచింద్రకుమార్ పట్నాయక్, జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు జిల్లా స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ రాజశేఖర్, జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి, ఇతర జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర జిల్లా ప్రత్యేక అధికారి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించడానికే ఈ యాత్ర ముఖ్య ఉద్దేశమన్నారు. జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు మాట్లాడుతూ జిల్లాలో 697 పంచా యతీల్లో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై అవగా హన కల్పించడానికి వికసిత్ బారత సంకల్ప యాత్ర పక్కాగా నిర్వహించడానికి ప్రణాళికలు సిద్దం చేసి అమలు చేస్తున్నామన్నారు. జిల్లాలో ఈ కార్యక్రమం నవంబర్ 27 నుండి ప్రారంభం అయ్యిందని, ఈ కార్యక్రమానికి జిల్లా నోడల్ అధి కారిగా జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి వ్యవహరిస్తున్నామన్నారు. ఒకొక్క వాహనం ప్రతిరోజు రెండు పంచాయతీల్లో డిజిటల్ స్క్రీన్‌లో వీడియోల ద్వారా కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడం జరుగుతున్నదన్నారు. సమావేశంలో డిఆర్‌డిఎ పిడి డిఎంకె తులసీ, హౌసింగ్ పిడి పద్మనాభం, మెప్మా పిడి రాధమ్మ, జిల్లా సాంఘీక సంక్షేమ శాఖ డిడి డాక్టర్ రాజ్యలక్ష్మి, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మి, పంచాయతీరాజ్ ఎస్ఇ చంద్రశేఖర్‌రెడ్డి, డిఎస్ఓ శంకరన్, డిఎల్‌డిఓ రవికుమార్, ఎల్‌డిఎం హరీష్, డిఐసి జిఎం చంద్రశేఖర్, నెహ్రూ యువకేంద్రం జిల్లా కో-ఆర్డినేటర్ ప్రదీప్‌కుమార్, జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి చిన్నారెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ, ఐసిడిఎస్ పిడి నాగశైలజ, బిసీ వెల్ఫేర్ ఆఫీసర్ రబ్బానీ భాషా, డిపిఆర్‌సికో-ఆర్డినేటర్‌షణ్ముగరామ్, అధికారులు హాజరయ్యారు.

## కరుణించిన గంగమ్మలు : వెల్లి విరిసిన భక్త హృదయాలు

**ఏడుదిక్కులను చల్లంగా కాపాడు తల్లి**
**శ్రీకాళహస్తిలో కన్నుల పండువగా ఏడు గంగమ్మల జాతర**



పెండ్లిమండపం పొన్నాలమ్మ దర్శనం

శ్రీకాళహస్తి, డిసెంబర్ 6 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో చలికాలం నిర్వహించే ఏడుగంగమ్మల జాతర రెండేళ్ళ తరువాత భక్తుల భాగస్వామ్యంతో కన్నుల పండువగా బుధవారం నిర్వహించారు. ఏడుగంగమ్మల దర్శనంతో పట్టణంలోనూ, చుట్టుపక్కల గ్రామాల్లో భక్తి భావం విల్లివిరిసింది. ఏడు దిక్కులను చల్లంగా కాపాడండి అక్కచెల్లెల్లార అంటూ భక్తులు మొక్కుకున్నారు. రెండేళ్ళ తరువాత నిర్వహించిన ఏడుగంగమ్మల జాతరకు జనం సునామీలా కదలివచ్చారు. ఒకు కాదు ఏడు మంది అక్కా చెల్లెలు. పసుపు కుంకుమను నిలిపే పొన్నాలమ్మ, అభయమిచ్చే ముత్యాలమ్మ, అందరూబాగుండాలని ఆశీర్వ దించే కావమ్మ, కరుణ చూపే అంకమ్మ, పీడ పిశాచులను వదిలించే నల్లగంగమ్మ, సుమంగళిని నిలిపే అంకాళమ్మ, సంతాన ప్రాప్తి కల్గించే భువనేశ్వరి దేవిలుగా వెలసి భక్తుల కొంగు బంగారంగా వరాలిస్తున్నారు.

**అలంకారాలతో ఆకట్టుకున్న గంగమ్మలు**

శ్రీకాళహస్తిలో నిర్వహించే ఏడు గంగమ్మల జాతరలో నిర్వాహకులు సప్పరాల ఏర్పాటు, స్థావరాల ముస్తాబులో పోటీలు పడటం ఆనవాయితి. ఈ నేపథ్యంలో ఈ ఏడాది కూడా నిర్వాహకులు తమిళనాడు, ఇతర ప్రాంతాల నుంచి కళాకారులను రప్పించారు. రెండేళ్ళ తరువాత అంగరంగ వైభవంగా నిర్వహించిన జాతరలో ఏడుగురు అమ్మవార్లను రక రకాలుగా ముస్తాబు చేసారు. పెండ్లిమండపం వద్ద పొన్నాలమ్మకు ఆదిపరాశక్తి అలంకరణ సూర్యప్రభవాహనం, బేరివారి మండపం వద్ద ముత్యాలమ్మ అమ్మవారు పార్వతీదేవిగా రజతగిరి హంసవాహనంపై దర్శనంఇవ్వగా, పూలసవీధిలో వెలసిన కావమ్మదేవతకు కామాక్షిదేవి అలంకరణలో శివకమలప్రభవాహనంపై కొలువుదీరారు. సన్నిధివీధిలోని అంకాళమ్మ భవానీదేవిగా శుకపుష్పప్రభ సింహవాహనంపై, తేరువీధిలో వెలసిన నల్లగంగమ్మ జయకనకదుర్గాంబిక అలంకరణ సూర్యమణి ఆనందనిలయం, గాంధీవీధిలో వెలసిన అంకమ్మ దేవత మీనాక్షిదేవిగా నెమలి సింహాసన శ్రీకాళికాదేవి మయూరవాహనంపై దర్శనం ఇచ్చారు. కొత్తపేట భువనేశ్వరి దేవి ఖడ్గవీరేశ్వరిదేవి అలంకరణలో చంద్రప్రభ, చత్రం అలంకరణలో అశ్వవాహనంపై దర్శనం ఇచ్చారు.

**సంప్రదాయబద్ధంగా పూజలు: గ్రామోత్సవం**

పట్టణంలోని ముత్యాలమ్మగుడివీధిలోని తెట్టురాయికి సమీపంలోని ఏడుగంగమ్మలు నిలిచేస్థలంలో ఏడు ప్రాంతాల్లో గంగమ్మలను ఆచారం ప్రకారం నిల్పారు. ఏగుగంగమ్మల ఆలయంలో మూలవిరాట్టుకు ప్రత్యేక అలంకారాల్ని నిర్వహించారు. కుంభంచుట్టు గుమ్మడికాయల్ని ఏర్పాటుచేశారు. వాటిని ఒకే వేటులో నరికి బలిదానం చేశారు. అనంతరం అఖండహరతులిచ్చారు. ఈసందర్భంగా కుమ్మరులు చెందిన వారు బంకమట్టిని రజకులు ముద్దలు చేసి పసుపుతో కలిపి అమ్మవారి రూపాలుగా తయారుచేశారు. తర్వాత భక్తిశ్రద్ధలతో తయారుచేసిన పసుపుముద్దల చొప్పున ఇచ్చారు. వాటిని ఆయా గంగమ్మల కమిటీ నిర్వాహకులు తీసుకుని భద్రపరచారు. అమ్మవారికి ఎదురుగా అఖండదీపాన్ని వెలిగించారు. కాగా దేవస్థానం సమర్పించిన సారెను ఆలయం నుంచి అందించారు. వేకవజాము 4గంటల సమయంలో పంబ జోళ్లమోత, తప్పెట్లతో గంగమ్మలను(పసుపు ముద్దలను). ముత్యాలమ్మగుడివీధిలో గంగమ్మలుబయలుదేరే సమయంలో మొదట ప్రతి అమ్మవారి విగ్రహం వద్ద గుమ్మడికాయలు, టెంకాయలు కొట్టి అఖండ కర్పూరహరతులిచ్చారు.

## ప్రత్యేక ప్రతిభావంతులను ప్రోత్సహిస్తే అత్యుత్తమ ఫలితాలు

ప్రధాన ఉపాధ్యాయురాలు లీలావతి



**వెదురుకుప్పం, డిశంబర్ 6 ప్రభాతవార్త:** ప్రత్యేక ప్రతిభావంతులను ప్రోత్సహిస్తే అత్యుత్తమ ఫలితాలు సాధించగలరని ప్రధానోపాధ్యాయురాలు లీలావతి అన్నారు. పచ్చికాపల్లం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పేరెంట్స్ సమావేశంలో ఆమె మాట్లాడుతూ దివ్యాంగులైన విద్యార్థులకు ప్రభుత్వం సమగ్ర శిక్షాఅభియాన్ ద్వారా వివిధ పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. వీరిని తగిన రీతిలో తీర్చిదిద్దగలిగితే ఉత్తమ పౌరులుగా వివిధ రంగాలలో రాణించగలరన్నారు. అనంతరం విద్యార్థులకు ప్రోత్సాహక బహుతులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం దేవరాజులు, ఐఈఆర్పి కె.శ్యామల, ఎం.రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక స్వాలంబనతోనే వెనుకబడిన వర్గాల అభివృద్ధి

కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పోటుగారి భాస్కర్



**వెదురుకుప్పం, డిశంబర్ 6 ప్రభాతవార్త:** ఆర్థిక స్వాలంబన సాధించడం ద్వారానే వెనుకబడిన వర్గాలు అభివృద్ధి చెందగలరని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పోటుగారి భాస్కర్ అన్నారు. బుధవారం ఆయన మండల కేంద్రంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూమాలవేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయ సాధనకు నేటి ప్రభుత్వాలు తూట్లు పొడుస్తున్నాయంటూ ధ్వజమెత్తారు. ప్రస్తుతం ప్రజా ప్రతినిధులు కొంత మంది కనీసం రాజ్యాంగాన్ని గౌరవించే స్థితిలో లేరని దుయ్యబట్టారు. తద్వారా ప్రజల్లో ప్రజా ప్రతినిధులు విశ్వాసం కోల్పోతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కందుకూరి హుమేష్, నాయకులు సుబ్రమణ్యం రెడ్డి, దావూద్, పళ్ళిపట్టు భాస్కర్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్వీయూనివర్సిటీ ఖోఖో జట్టుకు విద్యార్థిని ఎంపిక

**కుప్పం, డిసెంబర్ 6 ప్రభాతవార్త**



తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ సౌత్‌జోన్ ఖోఖో జట్టుకు కుప్పం డిగ్రీ కాలేజ్‌కు చెందిన మౌనిక అనే విద్యార్థిని ఎంపికైనట్లు ఛైర్‌పర్సన్ శాంతనాగరాజ్, వైస్‌ఛైర్మన్ సాగర్‌రాజ్ తెలిపారు. ఇటీవల తిరుపతిలో జరిగిన అంతర్ కళాశాలల ఖోఖో పోటీల్లో పాల్గొని యూనివర్సిటీ జట్టుకు తమ విద్యార్థిని ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు. ఈసందర్భంగా మౌనికను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుధారాణి, పిడి సుధాకర్ పాల్గొన్నారు.

## పేద ప్రజల ఆశాజ్యోతి..మార్గదర్శి డా॥ అంబేద్కర్

– ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్

**కుప్పం, డిసెంబర్ 6 ప్రభాతవార్త**



భారతదేశంలోని పేద ప్రజల ఆశాజ్యోతి, మార్గదర్శి రాజ్యాంగ నిర్మాత డా॥ బిఆర్ అంబేద్కర్ అని ఎమ్మెల్సీ,సమన్వయ కమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక బస్టాండు, ఎన్టీఆర్ భవన్‌లో ఆయన డా॥ అంబేద్కర్ విగ్రహాలకు పూజలు చేసి నివాళులు అర్పించారు. డా॥ అంబేద్కర్ దేశ ప్రజలకు మహోన్నతమైన రాజ్యాంగాన్ని అందించారన్నారు. కార్యక్రమాల్లో ఇన్‌చార్జ్ పిఎస్‌మునిరత్నం,కన్వీనర్ ఆర్. చంద్రశేఖర్, రాష్ట్రనేతలు గోపీనాథ్,కాణిపాకం వెంకటేష్, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, నేతలు డా॥ వెంకటేష్, సత్యేంద్రశేఖర్, కన్నన్, డికెపల్లి మణి, మురుగేష్, ఎల్లప్ప, మునెప్ప, ఆర్ఆర్ రవి, రవినాయక్, లక్ష్మీపతి, వినయ్,అనసూయ, తిరుమగళ్, పుష్ప, ముఖేష్, సతీష్, నరేష్, కౌన్సిలర్లు సోమశేఖర్, వేలు, జాకీర్,సుబ్బు తదితరులు పాల్గొన్నారు.అలాగే మాలమహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు కన్నన్ అధ్వర్యంలో దళిత నేతలు డా॥ అంబేద్కర్ విగ్రహంకు పూజలు చేశారు. కార్యక్రమంలో విజయ్‌కుమార్, మునస్వామి, మురుగేష్, బాబు,రామకృష్ణ, గిరి,తిమ్మప్ప పాల్గొన్నారు.

## వృద్ధురాలు మృతి.. దేశంనేతలచే ఆర్థికసాయం

**కుప్పంరూరల్, డిసెంబర్ 6 ప్రభాతవార్త**



మున్సిపల్ పరిధి 18వవార్డుకు చెందిన లక్ష్మి అనే వృద్ధురాలు మృతి చెందింది. దీంతో ఆమె అంత్యక్రియలకోసం తెదేపా నేతలు ఆర్థికసాయం చేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో రాష్ట్రనేత గోపీనాథ్, కౌన్సిలర్ జాకీర్, నేతలు ఆర్ఆర్ రవి, ఖాసిం,జాలు, ఉమర్ పాల్గొన్నారు.

## ఐరాలలో ఘనంగా అంబేద్కర్ వర్ధంతి

**ఐరాల, డిసెంబర్ 6 ప్రభాతవార్త:**



భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 67 వర్ధంతిని బుధవారం మండల కేంద్రం ఐరాలలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఐరాలలో వున్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అలాగే దళిత, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి అంబేద్కర్ చేసి న సేవలను కొనియాడారు. ఈకార్యక్రమంలో మండల దళిత నాయకులు సిద్దయ్యమూర్తి, విశ్వనాథం, వెంకటస్వామి, నటరాజ, రాజశేఖర్, రాజేంద్ర, చంద్రబాబు, మునిరాజులు,ఏకాంబరం,గోవిందయ్య,బ్రహ్మతేజ,వినోద్‌కుమార్,హరి తదితరులు పాల్గొన్నారు.

అగరంపల్లెలో...

**కాణిపాకం, డిసెంబర్ 6 ప్రభాతవార్త:** రాజ్యాంగ నిర్మాత బిఆర్ అంబేద్కర్ వర్ధంతిని కాణిపాకం గ్రామ పంచాయతీ అగరంపల్లె కూడలిలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో స్థానిక దళిత నాయకులు నటరాజన్, పుణ్యసముద్రం రవిప్రసాద్,చిట్టెమ్మ, నాగేంద్రబాబు మురుగయ్య, చిరంజీవి, గుణ, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు. ఇదిలా వుండగా ఈసందర్భంగా పీసీసీ డెలిగేట్ సభ్యుడు ఏపీ పరదేశి ఆధ్వర్య ంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

## కాణిపాకంలో పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం భవనం కూల్చివేత

**కాణిపాకం, డిసెంబర్ 6 ప్రభాతవార్త:**



కాణిపాకం గ్రామ పంచాయతీ పరిధిలోని కాకర్లవారిపల్లె వద్ద నున్న పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం భవనాన్ని రెవెన్యూ అధికారులు బుధవారం కూల్చివేశారు. కాకర్లవారిపల్లె గ్రామ సమీపంలో మణికంఠేశ్వరాలయం వెనుకవైపున గత మూడు దశాబ్దాల క్రితం ప్రభుత్వ భూమిలో పాడి రైతుల సౌకర్యార్థం పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం భవనం, పక్కనే పశువైద్యశాలను నిర్మించారు. అయితే దేవస్థానంకు చెందిన స్థలంలో వున్నందున ఆభవనాలను తమకు అప్పగించాలని రెవెన్యూ అధికారులకు దేవస్థానం అధికారులు లేఖ రాశారు. దీనితో రెవెన్యూ అధికారులు భవనాల అప్పగింతకు నోటీసులు జారీ చేశారు. దీనితో గ్రామస్థులు కోర్టుకు వెళ్ళడంతో కోర్టు దేవస్థానం అధికారులకు అనుకూలంగా తీర్పునివ్వడంతో భవనాన్ని బుధవారం సాయంత్రం జెసీబిల సాయంతో కూల్చివేశారు. అయితే రైతులకు, గ్రామస్థులకు విస్తృత ప్రయోజనాలు కల్పిస్తున్న భవనాన్ని కూల్చి వేయడం దారుణమని పూతలపట్టు నియోజవర్గ టీడీపీ ఇన్‌చార్జి మురళీమోహన్ విలేకరులతో మాట్లా డుతూ ధ్వజమెత్తారు. దేవస్థానంకు చెందిన భూములను స్థానిక వైకాపా నాయకులు ఆక్రమించుకుని భవనాలు నిర్మిస్తున్న దేవస్థానం అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు.

## డీవైఈఓచే పాఠశాలల ఆకస్మిక తనిఖీ

**తవణంపల్లె, డిసెంబర్ 6 ప్రభాతవార్త:**



మండలంలోని పలు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను చిత్తూరు డీవైఈఓ చంద్రశేఖర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈమేరకు మండలంలోని మల్లకుంట, కృష్ణాపురం ప్రాథమిక పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో రికార్డులను తనిఖీ చేశారు. అలాగే ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరుపట్టీలను పరిశీలించారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలను పరిశీలించారు. దీనితో పాటు అలాగే పిల్లల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఈకార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు హేమలత, త్యాగరాజులురెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## అణగారిన వర్గాల ఆత్మబంధువు డా॥ అంబేద్కర్

– మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్

**కుప్పం, డిసెంబర్ 6 ప్రభాతవార్త**



దేశంలోని అణగారిన వర్గాల ఆత్మబంధువు రాజ్యాంగ నిర్మాత డా॥ బిఆర్ అంబేద్కర్ అని కుప్పం మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్ పేర్కొన్నారు.బుధవారం అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా స్థానిక బస్టాండు వద్దగల డా॥ అంబేద్కర్ విగ్రహంకు ఛైర్మన్ పూజలు చేసి పూలమాలలు వేసి ఘననివాళులు అర్పించారు. ఈసందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ దేశంలో దళిత, గిరిజనులు, బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి డా॥ అంబేద్కర్ ఎనలేని కృషి చేశారన్నారు. ప్రపంచంలోనే ప్రజాస్వామ్య దేశాలు గర్వించదగ్గ రాజ్యాంగాన్ని భారతదేశానికి అందించారన్నారు. ఆయన అడుగు జాడల్లో నడవాలని పిలుపునిచ్చారు.కార్యక్రమాల్లో ఎపిసిఎస్‌సి డైరెక్టర్ మైసూరు శ్రీనివాసమూర్తి, కౌన్సిలర్లు గణపతి, రాజ్‌కుమార్, మోహన్‌రాం,నాగరాజు, విజయ్, సయ్యద్ అలీ, అరవింద్, ఎంఆర్ సురేష్, నేతలు సతీష్‌కుమార్, సిపి మనోహర్, సర్దార్, పిజి సెల్వం, ఇందుశేఖర్,రాజా,హనుమంతు, జయశంకర్, కుమరేష్ తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## పీడిత గుండెల్లో ఆరని జ్యోతి అంబేద్కర్

**చౌడేపల్లి, డిసెంబర్ 6 ప్రభాతవార్త**



పీడిత జాతి గుండెల్లో ఆరని జ్యోతి అంబేద్కర్ అని పలువురన్నారు. బుధవారం భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ 67వ వర్ధంతిని పురష్కరించుకొని మాలమహానాడు జిల్లా ఉపాధ్యక్షుడు శివకుమార్ ఆధ్వర్యంలో స్థానికబస్టాండు నందు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలేసి ఘనంగా నివాళులర్పిం చారు. అంబేద్కర్ భవన వ్యవస్థాపక అధ్యక్షుడు బ్యాంకు రెడ్డెప్ప చే ఎస్సీ బాలురు, బాలిక వసతిగృహాల్లో వర్ధంతిని జరుపుకొన్నారు. అంబేద్కర్ జీవిత చరిత్రను విద్యార్థులకు వివరించారు. కూరపర్తి శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, ముకుందా, మణి, పొదలపల్లి రమణ, పరమేష్, కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర కబడ్డీ క్రీడా నిర్వహణ హర్షనీయం : ఎంపిపి

–శ్వేతపత్రం విడుదల చేసిన మిద్దింటి

**చౌడేపల్లి, డిసెంబర్ 6 ప్రభాతవార్త**



స్థానిక ఉన్నతపాఠశాల ఆవరణంలో ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్–17 కబడ్డీ పోటీల నిర్వహణ హర్షనీయమని ఎంపిపి గాజుల రామ్మూర్తి అన్నారు. కబడ్డీ పోటీల నిర్వహణా జమా, ఖర్చులపై బుధవారం స్థానిక ఉన్నతపాఠశాలలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నిర్వహణా వ్యయంపై మిద్దింటి కిషోర్ శ్వేతపత్రాన్ని విడుదల చేసారు. రాష్ట్రంలోని 13జిల్లాల్లోనూ కబడ్డీ నిర్వహణకు పోటీలు పద్దారనీ, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిల సహకారంతో చౌడేపల్లిలో క్రీడలు నిర్వహించడం గర్వకారణమన్నారు. ఈ క్రీడలు వ్యయంతో కూడుకొన్నది కాబట్టి దాతల సహాయం తీసుకొన్నామన్నారు. ఇతర జిల్లాల నుంచి వచ్చిన బాల, బాలికలకు భోజన, మౌళిక వసతుల కల్పనలో రాజీ పడలేదనీ, ఈ విషయాన్ని క్రీడాకారులే ఒప్పుకొన్నారన్నారని గుర్తు చేసారు. క్రీడల నిర్వహణకు రూ. 8,59,318లు దాతలు సాయం చేయగా, వ్యయం రూ. 9,68,260లు అయ్యిందన్నారు. అనంతరం క్రీడా నిర్వహణపై చర్చించారు. సర్పంచు శ్రీరామ్ భరత్‌వరుణ్, ప్రధానోపాధ్యాయుడు నాగరాజరెడ్డి, ప్రైవేట్ పిఇటిల జిల్లా కార్యదర్శి లీలాకుమార్‌నాగ్, పిడి రామచంద్రయ్య, కడియాల మహేష్‌బాబు, ఉపాధ్యాయులు మురళి, దేవదానం, గాజుల మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## యువతకు ఇవిఎంలపై అవగాహన

**చౌడేపల్లి, డిసెంబర్ 6 ప్రభాతవార్త**



ఎన్నికల్లో యువత ఇవిఎంల ద్వారా ఏ విధంగా ఓటు వేయాలన్న అంశంపై అవగాహణ కల్పించారు. బుధ వారం స్థానిక సచివాలయం–2లో యువతతోపాటు ఓటర్లకు ఇవిఎం పనితీరు, ఓటు నిక్షిప్తమయ్యే విధా నం గురించి విరవించారు. ప్రత్యేకాధికారి కేశవరెడ్డి, సూపర్‌వైజర్ టి.మాధవి, ఎఎస్ఓ భూపతి, సచివా లయ అధికారులు, స్థానికులు పాల్గొన్నారు.

## తవణంపల్లెలో ఘనంగా అంబేద్కర్ వర్ధంతి

**తవణంపల్లె, డిసెంబర్ 6 ప్రభాతవార్త:**



భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 67 వర్ధంతిని బుధవారం మండల కేంద్రం తవణంపల్లెలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మండల దళిత యువజనసేవాసంఘం ఆధ్వర్యంలో స్థానిక మండల కార్యాలయం వద్ద నున్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మండల దళితసంఘం నాయకులు షణ్ముగం, పరదేశి, డేవిడ్, జగన్నాధం, ఏకరాజ్, చిన్నెయ్య, అనంతరాములతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## స్వర్ణముఖి నది గండిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

**వాకాడు, డిసెంబర్ 6, ప్రభాతవార్త**



బాలిరెడ్డిపాలెం గ్రామం వద్ద స్వర్ణముఖి నది తెగిన గండిని బుధవారం స్థానిక ఎమ్మెల్యే వరప్రసాద్ రావు పరిశీలించారు. ఎమ్మెల్యే వరప్రసాద్ రావు ఆ ప్రాంతంలో క్షుణ్ణంగా పరిశీలించారు. స్థానిక నేత, సొసైటీ అధ్యక్షులు కొడవలూరు దామోదర్ రెడ్డి ఆ ప్రాంతాల గురించి తెలిపారు. మిచౌంగ్ తుఫాను ప్రభావంతో యూనియన్ బ్యాంక్ సమీపం వద్ద స్వర్ణముఖి నది బ్యారేజ్‌కి ఉధృతంగా నీటి ప్రవాహం పెరగడంతో గేట్ల పై నుంచి జలప్రళయం పెరగడంతో దిగువు వున్నా గ్రామమైన బాలిరెడ్డిపాలెం సమీపంలో బ్యాంకు వద్ద గండి పడటంతో గ్రామంలోకి వరద నీరు ప్రవేశించి, రెండు ఇల్లు కొట్టుకుని పోవడం జరిగింది. అదేవిధంగా మండలంలోని ప్రతి గ్రామంలో వరద నీరు ఇళ్లలోకి ప్రవేశించాయని ఎమ్మెల్యేకి ఆయన సూచించారు. ఈ ప్రాంతంలో ఆస్తి నష్టం ఎక్కువగా నష్టపోయారని ఎమ్మెల్యేకి ఆయన తెలిపారు. ఎమ్మెల్యే వరప్రసాదరావు స్పందించి గంగన్న పాలెంలో బ్రిడ్జి నిర్మాణానికి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని, జరిగిన నష్టాన్ని తెలియజేయడం జరుగుతుందని, ఎమ్మెల్యే తెలిపారు. ఆయన వెంట ఎంపిడిఓ గోపినాథ్, తహశీల్దార్ నరసింహారావు, ఏఎంసి డైరెక్టర్ జనార్ధన్ రెడ్డి, ఎస్ఐ రఘునాథ్, తదితరులు ఉన్నారు.

## పీర కుమార్‌కు డాక్టరేట్ ప్రధానం

**గూడూరు, డిసెంబర్ 6, ప్రభాతవార్త**



ఎస్‌కెఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అర్థశాస్త్ర అధ్యాపకుడిగా పని చేస్తున్న పీర కుమార్‌కు విక్రమ సింహపురి యూనివర్శిటీ డాక్టరేట్ ప్రధానం చేసారు. ఈయన వృద్ధి, అస్థిరత, సరఫరా ప్రతిస్పం దనలు అనే అంశంపై చేసిన పరిశోధనకుగాను అర్థశాస్త్రంలో డాక్టరే ట్‌ను పొందారు. సీనియర్ ప్రొఫెసర్ ఎన్ఆర్వి రమణారెడ్డి మార్గ దర్శకత్వంలో పీర కుమార్ పరిశోధన చేసి విశ్వవిద్యాలయానికి సిద్ధాంతం సమర్పించారు. యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించడంతో కళాశాల అధ్యాపకులు మిత్రులతో సహ నెల్లూరు టీవీ సినిమా నాటక రంగ కళాకారులు కూడా ఆయనను అభినందించారు. పీరకుమార్ గతంలో వ్యవసాయాన్ని ప్రోత్సహించే వివిధ దూరదర్శన్ సప్తగిరి ఛానల్‌లో ప్రసారమైన టెలి ఫిల్మ్‌లలో కథానాయకుడిగా కూడా నటించి ఉండడం విశేషం. ఈ సందర్భంగా పీర కుమార్ తనకు పరిశోధనపై ఆసక్తిని రేకెత్తించి మార్గదిశానిర్దేశం చేసిన గైడ్ సీనియర్ ప్రొఫెసర్ ఎన్ఆర్వి రమణారెడ్డికి కృతజ్ఞతలు తెలియజేసారు.

## నేలవాలిన పైర్లు - నీట మునిగిన పంటలు

**కోట, డిసెంబర్ 6, ప్రభాతవార్త**

మిచౌంగ్ తుపాను మండలంలో భీభత్సం సృష్టించింది. వర్షాలతో వాగులు, వంకలు, పొంగిపొర్లి పలు చోట్ల రాకపోకలు నిలిచిపోయాయి. గాలుల ఉధృతికి చెట్లు, కొమ్మలు విరిగిపడ్డాయి. విద్యుత్తు అంత రాయంతో ప్రజలు అవస్థలు పడ్డారు. తీర ప్రాంతాలకు రాకపోకలు నిలిచిపోయాయి. పంట పొలాలు నీట మునగడంతో అన్నదాతకు అపార నష్టం వాటిల్లింది. ఇప్పటికే ఖరీఫ్‌కు కాలం కలసిరాలేదు. రబీలో వేసిన పైర్లు మునిగిపోయాయి.

## సిఎం వైఎస్ జగన్‌తోనే సంక్షేమం

**గుడిపాల, డిసెంబర్ 6 ప్రభాతవార్త:**

సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పలు పథకాలు అమలు చేస్తున్నారని ఎంపిపి ప్రసాద్‌రెడ్డి అన్నారు. రామభద్రాపురం గ్రామ సచివాలయం పరిధిలో బుధవారం జగనే ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యంను సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నిజం చేశారన్నారు. పాలన క్షేత్ర స్థాయికే తీసుకువచ్చి సమస్యలను ఎక్కడికక్కడ పరిష్కరించడానికి చర్యలు తీసుకొంటున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో సైతం మళ్ళీ సిఎంగా వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని ఎన్నుకొంటే రాష్ట్ర మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు సాయి, రజనీకాంత్, సూరి, త్యాగ, వేణు, కిరణ్, ధరణి, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## వరగాలి క్రాస్‌రోడ్‌పై రోడ్డు ప్రమాదం

ఆటోను ఢీకొన్న టెంపో ఆటోలో వెళ్తున్న ముగ్గురికి తీవ్ర గాయాలు

శబరిమలై నుంచి కావలి వైపు వెళ్తుండగా ప్రమాదం

**చిల్లకూరు, డిసెంబర్ 6, ప్రభాతవార్త**



చిల్లకూరు మండలంలోని వరగాలి క్రాస్ రోడ్డు వద్ద ఆటోను వెనక నుండి టెంపో ఢీకొనడంతో ప్రమాదం ఆటోలో కడివేడుకు చెందిన ముగ్గురు ఆడవాళ్ళు పని నిమిత్తం గూడూరుకు వెళ్తూ ఉండగా ఈ ఘటన చోటు చేసుకుంది. క్షతగాత్రులను గూడూరు ప్రభుత్వహాస్పిటల్‌కి తరలించారు. టెంపో శబరిమల నుంచి కావలి వెళ్తుండగా మార్గం మధ్యలో ఈ ఘటన చోటు చేసుకుంది. అందులో స్వాములు 16 మంది ఉండగా స్వాములుకి ఎలాంటి ప్రమాదం జరగకుండా బయటపడ్డారు. వీరందరూ కావలికి చెందిన వారిగా గుర్తించారు.

## మహనీయుడు అంబేద్కర్

మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్

**గూడూరు, డిసెంబర్ 6, ప్రభాతవార్త**



డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ద్వారా పేద ప్రజల ఎంతో అభివృద్ధి చెందారని ఆ మహనీయుడును ప్రతి ఒక్కరు గుర్తించుకోవాలని గూడూరు నియోజవకర్గ టిడిపి మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ వెల్లడించారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా గూడూరు పట్టణంలోని అశోక్ నగర్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి అలాగే పాత బస్టాండ్ వద్ద ఉన్న విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ పేద కుటుంబంలో జన్మించి ఎంతో ఉన్నత చదువులు చదివి రాజ్యాంగాన్ని బిఆర్ అంబేద్కర్ రూపొందించారని అన్నారు. ఆయన కల్పించిన రిజర్వేషన్ వల్ల ఈ రోజు ఈ స్థాయిలో ఉన్నామని టిడిపి ప్రభుత్వంలో ఐసిఎస్ రోడ్డులో అంబేద్కర్ భవన్‌కు శంకుస్థాపన చేశామని వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత దాన్ని నిరుపయోగంగా వదిలేసిందని వెల్లడించారు.

## అన్నదాతపై తుపాన్ పంజా

**కోట, డిసెంబర్ 6, ప్రభాతవార్త**

మిచౌంగ్ తుపాను ప్రభావంతా భారీ వర్షాలు కురవడంతో ఈదురు గాలుల వలన మండలంలో జనజీవనం స్తంభించింది. పలు చోట్ల విద్యుత్తు స్తంభాలు, భారీ వృక్షాలు నేలకొరగడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడ్డారు. వరినాట్లు మినుము పంటలు పూర్తిగా మునిగిపోయి అన్నదాతలకు అపార నష్టం వాటిల్లింది.

## వెందుగంపల్లిలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర

**కుప్పంరూరల్, డిసెంబర్ 6 ప్రభాతవార్త**



మండలంలోని వెందుగంపల్లిలో మంగళవారం వికసిత్ భారత్ సంకల్ ప్యాత్రను నిర్వహించారు. ఈసందర్భంగా ఈసందర్భంగా ప్రత్యేక వాహనంలో కేంద్రం అమలు చేస్తున్న స్వచ్ఛభారత్, ఉజ్వల గ్యాస్, పిఎం కిసాన్ సమ్మాన్, భీమాయోజన, అటల్ పెన్షన్, ఉపాధిహామీ పథకం, ఆయుష్మాన్ భారత్, సుకన్య సమృద్ధి యోజన, ఆవాస్ యోజన, జన్‌ధన్‌ఖాతా, ముద్ర రుణాలు, ఇ–శ్రమ్ కార్డులు తదితరాల గురించి వివరించారు. కార్యక్రమంలో కుప్పం బిజెపి ఇన్‌చార్జ్ శివశంకర్, ఎంపిడిఓ ఖాదర్ బాషా, ఎఓ అమృతవల్లి, ప్రజలు పాల్గొన్నారు.

## సర్పంచ్‌పై దాడి - ముగ్గురిపై కేసు నమోదు

**గుడిపాల, డిసెంబర్ 6 ప్రభాతవార్త:**

మండలంలోని కృష్ణజిమ్మాపురం సర్పంచ్ సంపూర్ణపై దాడి చేసిన కేసులో పోలీసులు ముగ్గురిపై కేసు నమోదు చేశారు. ఎస్ఐ చలపతి వెల్లడించిన వివరాల మేరకు కృష్ణజిమ్మాపురం పంచాయతీ వైఎస్ఆర్ కాలనీ లేఅవుట్‌లో పేదలకు ఇంటి స్థలాల పంపిణీ చేశారని, అయితే ఇంటి స్థలాల్లోకి లబ్ధిదారులు వెళ్ళకుండా అదే గ్రామంకు చెందిన బాలకృష్ణ, జయచంద్ర, మార్కొండలు కలిసి అడ్డుకొన్నారన్నారు. ఈ సమయంలో అక్కడే వున్న సర్పంచ్ సంపూర్ణ వారిని ప్రశ్నించగా సర్పంచ్‌ను దూషించడంతో పాటు ఆమె ఇంటి వద్ద వున్న సమయంలో ఆమెపై దాడి చేశారన్నారు. ఈ మేరకు సర్పంచ్ ఫిర్యాదు చేయడంతో ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడం జరిగిందన్నారు.

## తుఫాను బాధితులకు అండగా ఉంటాం

ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్

**గూడూరు, డిసెంబర్ 6, ప్రభాతవార్త**



మిచౌంగ్ తుఫాను బాధితులకు అండగా ఉంటామని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ప్రభుత్వ విప్ సహాయ మంత్రి మేరిగ మురళీధర్ పేర్కొన్నారు. బుధవారం గూడూరు పట్టణంలోని వరద నగర్‌లో ఉన్నటువంటి గిరిజన కాలనీ, ప్రజలను పరామర్శించి తుఫాను వలన ఇల్లు పూర్తిగా దెబ్బతిన్న నాలుగు గిరిజన కుటుంబాలకు 5000 చొప్పున ఎమ్మెల్సీ ఆర్థిక సాయం చేశారు. అక్కడ విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో మున్సిపల్ అధికారులు విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి త్వరితగతిన విద్యుత్ సరఫరా చేయవల్సిందిగా అధికారులు ఆదేశించారు. ఈయన వెంట వైఎస్ఆర్ పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి నారాయణ రెడ్డి, అశోక్ రెడ్డి, తాళ్లూరు శ్రీనివాసులు, బట్ట గోపి యాదవ్, అల్తాఫ్ బాయ్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలను వీడని తుఫాన్ కష్టాలు

**కోట, డిసెంబర్ 6, ప్రభాతవార్త**



తుఫానుగండం తప్పినా పాలకుల నిర్లక్ష్యగండం వెంటాడింది. విద్యుత్ శాఖ అధికారుల ముందు చూపులేకపోవడంతో గత మూడు రోజులుగా మండలంలో అనేక పల్లెలు గాడ అందకారంలో మగ్గుతున్నాయి. కర్లపూడి గిరిజన కాలనీ, కొత్తపాళెం గిరిజన కాలనీ, చికళ్ళ దిబ్బ, పుచ్చలపల్లి రుద్రవరం, ఉను గుంటపాలెం గ్రామాల మధ్య రోడ్లకు గండ్లు పడటంతో రెండు గ్రామాల మధ్య రాకపోకలు స్తంబించి పోయాయి. దైయాల దిబ్బ ప్రాంతాలలో రొయ్యల గుంట వద్ద చిక్కుకున్న పలువురిని ఆర్డిఓ కిరణ్ కుమార్, అగ్నిమాపక సిబ్బంది సహకారంతో రక్షించారు. మరో వంక విద్యుత్ సరఫరా లేకపోవడంతో మంచి నీటి కొరకు ప్రజలు అనేక కష్టాలు పడ్డారు. ముందు జాగ్రత్త చర్యగా పంచాయితీ పాలకులు జనరేటర్ల సమకూర్చలేక పోయారు. విద్యుత్ లేక సెల్ ఫోన్ చార్జింగ్‌కు ప్రజలు అవస్థలు పడ్డారు.

## ఇవిఎం..వివిప్యాట్ మెషీన్లపై అవగాహన

**కుప్పంరూరల్, డిసెంబర్ 6 ప్రభాతవార్త**



ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు బుధవారం కుప్పం తహశీల్దార్ కార్యాలయం వద్ద ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్, వివి ప్యాట్లపై ప్రజలకు ఆర్డీఓ శ్రీనివాసులు నేతృత్వంలో అవగాహన కల్పించారు. ఇవిఎం మెషీన్ ద్వారా ఓటు వేసే విధానంపై ప్రజలకు వివరించారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఇవిఎం మెషీన్లపై ఆయా మండలాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.ఎపిక్ డిటి శ్రీదేవి, డిటి దేవరాజ్, సిబ్బంది శ్రీనివాసులు, నిజాం పాల్గొన్నారు.

## డా॥ అంబేద్కర్‌కు ఘన నివాళులు

**శాంతిపురం,డిసెంబర్ 6 ప్రభాతవార్త**

రాజ్యాంగ నిర్మాత డా॥ బిఆర్ అంబేద్కర్ వర్ధంతిని మండలంలో నిర్వహించారు. రాళ్లబూదుగూరు పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై సుమన్ డా॥ అంబేద్కర్ చిత్రపటంకు పూజలు చేసి నివాళులు అర్పించారు. శాంతిపురం తెదేపా కార్యాలయం వద్ద డా॥ అంబేద్కర్ చిత్రపటంకు పూతలు పూజలు చేశారు. కార్యక్రమంలో నేతలు విశ్వనాథనాయుడు, జనార్ధనరెడ్డి, మణి, నాగరాజు, రమేష్, గోపాల్ పాల్గొన్నారు. మండల సచివాలయం వద్ద జడ్పీటిసి శ్రీనివాసులు, వైస్ ఎంపిపి పట్టాభి, ఎంపిడిఓ హేమమాలిని డా॥ అంబేద్కర్ చిత్రపటంకు పూజలు చేశారు. ఆటోస్టాండు వద్ద దళిత నేతలు డా॥ అంబేద్కర్ చిత్రపటంకు పూజలు చేశారు.దళితనేతలుకందస్వామి,దేవరాజు,రవీంద్ర,కాంగ్రెస్‌నేతకేశవరాజు పాల్గొన్నారు.

## తమిళనాడు మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

**గుడిపాల, డిసెంబర్ 6 ప్రభాతవార్త:** తమిళనాడు నుండి ఇక్కడికి అక్రమంగా మద్యం తరలిస్తున్న ఒక వ్యక్తిని అరెస్టు చేసి అతని నుండి 10 మద్యం ఫుల్ బాటిళ్ళు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఇబి ఎక్సైజ్ ఎస్ఐ వెంకటరత్నం తెలిపారు. నరహరిపేట చెక్‌పోస్టు వద్ద బుధవారం తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో ద్విచక్రవాహనంపై సుబ్రమణ్యంరెడ్డి(74) తమిళనాడు నుండి 10 ఫుల్ మద్యం బాటిళ్ళు తీసుకొని వస్తున్నాడన్నారు. ఈ క్రమంలో స్కూటర్‌ను తనిఖీ చేసిన సమయంలో అందులో 10 మద్యం ఫుల్ బాటిళ్ళు లభించాయన్నారు. ద్విచక్రవాహనంను సీజ్ చేసి సుబ్రమణ్యంరెడ్డిని

## నిండ్రలో తుపాను బాధితులకు రోజా ట్రస్ట్ సేవలు



పుత్తూరు, డిసెంబరు 6 ప్రభాతవార్త : తుపాను బాధితులకు వరుసగా రెండో రోజు బుధవారం కూడా రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్.కె.రోజా ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా సహాయం అందించారు. నిండ్ర మండలంలోని అగరంపేట దళితవాడలో మంత్రి సోదరుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి వరద బాధితులకు ఆర్థిక సాయం అందించారు. బాధిత 26 కుటుంబాలను పరామర్శించి వారికి బియ్యం, కంది పప్పు, నూనె వంటి నిత్యావసర వస్తువులను అందించారు. అలాగే అత్తూరు దళితవాడలో 45 కుటుంబాలకు నిత్యావసర వస్తువులు అందించారు. అలాగే మంత్రి రోజా ఆదేశాల మేరకు నియోజకవర్గంలో తుపాను వల్ల దెబ్బతిన్న రోడ్లను అధికారులు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేశారు. నగరి రూరల్ మండలంలోని బీరకుప్పం ఆర్ అండ్ బి లింక్ రోడ్డు వర్షాలకు పూర్తిగా దెబ్బతింది. దీని స్థానంలో కొత్తగా మట్టి రోడ్డు నిర్మించారు. పుత్తూరు, నగరి మునిసిపాలిటీల్లో నీరు నిల్వ ప్రాంతాల్లో జెసిబిలతో చదును చేసి నీటిని డ్రైనేజీల్లోకి మళ్లించారు. పుత్తూరు మునిసిపాలిటీలో నీళ్ల నిండి రాకపోకలకు అసౌకర్యంగా వున్న అండర్ బ్రిడ్జిలో నీళ్లను తోడారు. అక్కడక్కడ రోడ్లకు అడ్డంగా విరిగిపడిన చెట్లను తొలగించి రాకపోకలు అనువుగా ఏర్పాట్లు చేశారు.



# సూళ్లూరుపేటకు మిచౌంగ్ ఇక్కట్లు

- స్తంభించిన జనజీవనం
- గుక్కెడు నీళ్ల కోసం అగచాట్లు
- మూడురోజులుగా విద్యుత్ సరఫరా లేక ఇక్కట్లు



నీళ్ల కోసం క్యూలైనులో జనాలు



షార్ రోడ్డుపై నిలిచిన వరద నీరు

సూళ్లూరుపేట, డిసెంబర్ 6 ప్రభాతవార్త : మిచౌంగ్ తుపాను ప్రభావం సూళ్లూరుపేటపై తీవ్రంగా చూపింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ తుపాను ప్రభావంతో సూళ్లూరుపేట ఈ నెల 5వ తేదీ వరకు పూర్తిగా జలదిగ్బంధమైంది. ఒకవైపు విద్యుత్ సరఫరా లేకపోవడం, మరోవైపు మంచినీరు దొరక్క ఇక్కట్లు, ఆకలి తీర్చుకునేందుకు ఎక్కడా హోటళ్లు గాని, ఇతర ప్రత్యామ్నాయం లేకపోవడంతో ప్రజలు అల్లాడిపోయారు. ముఖ్యంగా సూళ్లూరుపేట పట్టణంలో ఎన్నడూ లేని విధంగా బుధవారం మధ్యాహ్నం వరకు గుక్కెడు నీళ్ల కోసం బారులు తీరి నిలబడ్డారు. రాఘవయ్యపేట ప్రాంతంలో మాత్రం మంగళవారం రాత్రి నుంచి విద్యుత్ సరఫరా పునరుద్ధరించడంతో అక్కడ వాటర్ ప్లాంట్ ఉండటంతో నీటిని తీసుకెళ్లేందుకు జనాలు ఎగబడ్డారు. మరోవైపు కొంతమంది స్వచ్ఛంధంగా స్పందించి తమ ఇళ్లలోని మంచినీటిని అందించేందుకు ముందుకొచ్చారు. వట్రపాలెం, ఇందిరానగర్, సాయినగర్, గణపతినగర్ ప్రాంతాలతో పాటు లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం కావడంతో మంగళవారం సాయంత్రానికి ఆ జలదిగ్బంధం నుంచి జనం తేరుకొని బయటపడ్డారు. కాగా, వట్రపాలెం, సాయినగర్‌లోని వరద బాధితులను మాత్రం పునరావాస కేంద్రాలకు తరలించి వారికి తగు సదుపాయాలు అధికార బృందం ఏర్పాటు చేసింది. పట్టణంలోని ప్రజలను మాత్రం ఎవరూ పట్టించుకున్న పాపాన పోలేదు. కనీసం మంచినీరు కూడా అందించే ఏర్పాట్లు చేయకపోవడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తుపాను ప్రభావం ఎక్కువగా ఉంటుందని తెలిసినప్పటికీ ముందుజాగ్రత్తగా ట్యాంకర్లలో మంచినీరు నింపుకొని కనీసం ప్రజలకు తాగేందుకు నీళ్లు కూడా ఇచ్చే ఏర్పాట్లు చేయకపోవడం పట్ల పట్టణ ప్రజలు అధికారుల తీరుపై మండిపడుతున్నారు. జాతీయ రహదారిపై వచ్చిన వరద నీరు తగ్గడంతో చెన్నై, నెల్లూరు వైపు రాకపోకలు ప్రారంభమయ్యాయి. తిరుపతి వెళ్లేందుకు మన్నారుపోలూరు వద్ద చీపురుగుంట, సమీపంలో రోడ్డుపై నీరు పారుతుండటంతో బుధవారం వరకు అటువైపు ఎటువంటి వాహనాలు వెళ్లేందుకు వీలు కాలేదు. లేఅవుట్లకు ఎక్కడపడితే అక్కడ అనుమతులు మంజూరు చేయడంతో ప్రస్తుతం కురిసిన భారీ వర్షాలకు వరద నీరు లేఅవుట్లను ముంచేసి దాంతో పాటు పక్కనే ఉన్న రహదారులపైకి, కాలనీలలోకి చొరబడ్డాయి. దీంతో ప్రజలు అధికారులు ముందస్తు చర్యలు తీసుకోకుండా ఇబ్బడిముబ్బడిగా లేఅవుట్లకు అనుమతులు ఇవ్వడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. పట్టణంలోని వివిధ హోటళ్లలో భోజనం దొరక్కపోవడంతో కేవలం చపాతి, పరోటా, ఉప్మా వంటి ప్రత్యామ్నాయ ఆహార పదార్థాలతో క్యూలైన్లలో నిలబడి కడుపులు నింపుకోవాల్సి వచ్చింది. అయినప్పటికీ తాగేందుకు మాత్రం నీరు లేకపోవడంతో అల్లాడిపోయారు. మినరల్ వాటర్ బాటిళ్లు హాట్ కేకుల్లా అమ్ముడయ్యాయి. బుధవారం వాటర్ క్యాన్లు, కొన్ని ట్యాంకర్లు మాత్రం నీరు తీసుకొచ్చి విక్రయించారు. మొత్తంమీద ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోవడంతో పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. దీంతో విద్యుత్ సరఫరా పునరుద్ధరించడంలోను కొన్ని ఆటంకాలు ఏర్పడటంతో గేటుకు తూర్పు వైపు మాత్రం విద్యుత్ సరఫరా అందజేసి మిగతాచోట్ల విద్యుత్ సరఫరా అందించలేకపోతు న్నారు. అధికారులు, నేతలు స్పందించకపోవడం పట్ల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# ఏడుగంగమ్మల జాతరలో మొక్కులు తీర్చుకున్న భక్తులు



పెండ్లిమండపం పొన్నాలమ్మ



.బేరివారి మండపం వద్ద వెలసిన ముత్యాలమ్మకు



జయరామారావువీధిలో కావమ్మ దేవత



సన్నిధివీధిలో అంకాళమ్మ భవానీదేవిగా



బ్రాహ్మణవీధిలో జయకనకదుర్గాంబిక



గాంధీవీధిలో అంకమ్మదేవతకు మీనాక్షిదేవిగా



కొత్తపేటలో వెలసిన భువనేశ్వరిదేవి



శ్రీకాళహస్తి, డిసెంబర్ 6 ప్రభాతవార్త : రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా శ్రీకాళహస్తి పట్టణంలో ఏడుగంగమ్మల జాతర నిర్వహించడం ఆనవాయితీ. జాతరను సంప్రదాయ బద్దంగా ఎంతో అంగరంగ వైభవంగా నిర్వహించే జాతరను నిర్వాహకుల పోటీలు పడి చేయడం గమనించదగ్గ విషయం. ఏడుగంగమ్మల జాతరలో భక్తులు వెయ్యికళ్ళ దుత్తలతో తమ మొక్కులు తీర్చుకున్నారు. పలువురు మహిళాభక్తులు, చిన్నారులు వేపాకు ధరించి నెత్తిన వేయికళ్ళ దుత్తలు పెట్టుకుని అందులో దీపాలు వెలిగించి గంగమ్మ చుట్టు ప్రదక్షిణలు చేసిన తర్వాత అమ్మవారి ముందు పగులగొట్టడం ఆనవాయితీ. పలువురు గంగమ్మమాలధారణ ధరించిన భక్తులు కూడా వేయికళ్ల దుత్తలతో మొక్కులు తీర్చుకున్నారు. ఈఏడాది నిర్వాహకులు కొంత సమయపాలనను పాటించారు. ప్రతి ఏడాది గంగమ్మకు జంతుబలులు వందలాది కనబడేది రోడ్లు రక్త సిక్తమయ్యేవి. కానీ ఈఏడాది ఆ వాతావణం కనబడలేదు. కారణం అమ్మవారి విగ్రహాల ప్రతిష్ట కార్యక్రమం ఏకాంతంగా జరిగింది.. దారి వెంబడి అడుగడుగునా ఎవరి స్థోమతను బట్టి వారు మొక్కులు చెల్లించుకున్నారు. గంగమ్మల ముందు కుంభంవేసి, పిండిదీపాలు వెలిగించి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. పోలీసులు అర్బన్ సిఐ అంజూయాదవ్, పోలీసులు ముందుజాగ్రత్త చర్యగా ఎటువంటి ఘర్షణలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లుచేపట్టారు. ట్రాఫిక్‌ను నియ ంత్రించటంలో పోలీసుల పాత్ర అభినందనీయం.

**ఏడుగంగమ్మల అమ్మవారికి మహాఅభిషేకం:**

శ్రీకాళహస్తి ముత్యాలమ్మగుడిలో వెలసిన ఏడుగంగమ్మలు నిల్పుస్థలంలో నిర్మించిన ఆలయంలోమూల విరాట్టుకు బుధవారం వేకువ జామున నిర్వహించిన 'మహాఅభిషేకం' లో శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు పాల్గొన్నారు. 18సంవత్సరాలుగా శ్రీనివాసులు ఉభయకర్త అయినప్పటికి పాల్గొనే అవకాశం లభించలేదన్నారు. ఆలయంలో అర్చకులు వేదపండితులు గంగమ్మకు విశేష అభిషేకాలు నిర్వహించారు. తొలుత కలశ స్థాపన పూజలు జరిపి తరువాత షోడశాభిషేకాలు నిర్వహించారు. అమ్మవారికి విశేషంగా పూలతోనూ ఆభరణాలతో అలంకారం జరిపారు. ఈ కార్యక్రమాల్లో పోలసామి స్వర్ణమూర్తి, అంజూరు బాలసుబ్రమణ్యం, పగడాల రాజు, సెన్నీనరుకుప్పం శేఖర్, మొగరాల గణేష్, గరికపాటి చంద్ర, చెంచయ్య, పెంచులయ్య, బాలగౌడ్, ఏడు గంగమ్మల కమిటిల అధ్యక్షులు వేదపండితులు మోహన్‌శర్మ, అప్పాజీ శర్మలతో పాటు డిఎస్‌పి భీమారావు, సిఐ అంజూయాదవ్, పాల్గొన్నారు.

## మెడికల్ కాలేజ్ పారిశుద్ధ్య కార్మికులకు వెంటనే జీతాలు ఇవ్వాలి

**ఏ1 కాంట్రాక్టర్ ప్రతినెల జీతాలు చెల్లించాలి**

**పారిశుద్ధ్య కార్మికుల జనరల్ బాడీ సమావేశంలో రాధాకృష్ణ పిలుపు**



తిరుపతి టౌన్, డిసెంబర్ 6 ప్రభాతవార్త: మెడికల్ కాలేజీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిధిగా హాజరైన ఏఐటీయూసి జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ మాట్లాడుతూ ఏ వన్ సర్వీస్ కాంట్రాక్టర్ మెడికల్ కాలేజీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు ప్రతినెలా జీతాలు చెల్లించడం లేదని మూడు నెలలుగా జీతాలు అందక కార్మికులు అనేక కష్టాలు పడుతున్నారని ఏడాది కాలంగా కార్మికుల వద్ద నుండి పిఎఫ్ డబ్బులు కట్ చేస్తున్న వారి అకౌంట్‌లో పిఎఫ్ డబ్బులు జమ చేయడం లేదని ఈఎస్ఐ కట్టడం లేదని కార్మికులు ఇంకా అనేక సమస్యలతో సతమతమవుతున్నారని కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని మూడు నెలల జీతాలు చెల్లించాలని లేనిపక్షంలో విధులు బహిష్కరించి నిరసన కార్యక్రమం చేపడుతామని ఈ విషయాన్ని మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ వెంటనే జోక్యం చేసుకుని కాంట్రాక్టర్‌ను పిలిపించి యూనియన్ నాయకులతో చర్చలు జరిపి జీతాలు కార్మికుల ఖాతాలో పడేలా చూడాలని లేనిపక్షంలో జరగబోయే విధుల బహిష్కరణకు బాధ్యత ప్రిన్సిపాల్ కాంట్రాక్టర్ వహించాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి తిరుపతి నగర ప్రధాన కార్యదర్శి ఎన్‌డి రవి, మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియర్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నరసింహులు మహేంద్ర, కిషోర్, సునీల్, బుజ్జేమ్మ, సుజాత, మంజుల తదితరులు పాల్గొన్నారు.

## ఆధునిక విమర్శకు మార్గదర్శకుడు కట్టమంచి



తిరుపతి (క్రీడా), డిసెంబర్ 6 ప్రభాతవార్త : శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయం తెలుగు అధ్యయన శాఖ ఆధ్వర్యంలో ధర్మనిధి ఉపన్యాస కార్యక్రమం నిర్వహించారు. ఆచార్య కట్టమంచి రామలింగారెడ్డి పేరుతో నిర్వహించిన ఈ ఉపన్యాస కార్యక్రమంలో ఆధునిక సాహిత్య విమర్శ దృక్పథాలు అనే అంశంపై హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ఆచార్యలు జి. అరుణకుమారి ప్రసంగించారు. ప్రాచీన కాలం నుండి విమర్శ వుందని, అది వ్యాఖ్యల రూపంలో ఉండేదని, ఆధునిక కాలంలో కట్టమంచి రామలింగా రెడ్డి విమర్శను విచారం పదంతో సూచించారని, సిపి బ్రౌన్ వంటి మహనీయుల వల్ల గ్రంథ పరిష్కరణ మెళకువలు నేర్చుకుందని, రాళ్లపల్లి అనంతకృష్ణ శర్మ వేమన పై చేసిన విమర్శకు మార్గదర్శి అని అన్నారు. వర్సిటీ ఇన్‌చార్జి వీసి ఆచార్య సుందరవల్లి ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ తెలుగు శాఖతో తనకు నాలుగు దశాబ్దాల అనుబంధం వుందన్నారు. అనంతరం డా. బిఆర్ అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకుని ఎస్వీయూలోని డా. బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమాన్ని ఎస్వీయూ తెలుగు విభాగాధిపతి ఆచార్య ఆర్. రాజేశ్వరమ్మ నిర్వహించారు. ఉపన్యాస ప్రాధాన్యతను ఆచార్య శ్రీనివాసులురెడ్డి తెలపగా , అతిధి ఉపన్యాసకులైన డా. సునీల్ కుమార్, డా. బ్రహ్మానందరెడ్డి, డా. ఆదిశేషయ్య, డా.అశోక్, సాహితీ వేత్తలు విద్యార్థులు, పరిశోధకులు పాల్గొన్నారు.

## తెగిపోయిన రొయ్యల గుంటలు...రూ. కోట్లలో నష్టం

కోట, డిసెంబర్ 6 ప్రభాతవార్త : తుఫాన్ మిగిల్చిన విషాదం అంతింత కాదు. కోట మండలంలోని దొరువు కట్ట, సిద్దవరం, గోవిందపల్లి తదితర గ్రామాలల్లో లక్షలాది రూపాయల పెట్టుబడులు పెట్టి సాగు చేసిన రొయ్యల గుంటలు అపారనష్టాన్ని కలిగించాయి. స్వర్ణముఖి నదికి గండ్లు పడడంతో రొయ్యల గుంటలన్నీ తెగిపోయి. గుంటలల్లో వున్న రొయ్యల పిల్లలంత కొట్టుకుపోయింది. 25 విద్యుత్తు స్తంభాలు నేలకు ఒరిగాయి. రోడ్లు దెబ్బతిన్నాయి. దొరువుకట్ట గ్రామంలో బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. కనీసం అధికారులు కూడా తమను పట్టించుకోలేదని ఆయా గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

## కాణిపాకం హుండీల ద్వారా 1.46 కోట్లు ఆదాయం



కాణిపాకం, డిసెంబర్ 6 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంకు హుండీ లెక్కింపు ద్వారా 1.46 కోట్లు రూపాయలు ఆదాయంగా వచ్చింది. బుధవారం స్థానిక ఆస్థాన మండపంలో ఆలయ చైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఈఓ ఎ.వెంకటేశుల ఆధ్వర్యంలో ఆలయ హుండీలను లెక్కించారు. ఈసందర్భంగా 20 రోజులకు గాను హుండీల ద్వారా 1,45,94,319 రూపాయలు ఆదాయంగా లభించింది. అలాగే 30 గ్రాముల బంగారు, నాలుగు కిలోల 410 గ్రాముల వెండి ఆదాయంగా వచ్చింది. అలాగే గోసంరక్షణ హుండీ ద్వారా 8,038 రూపాయలు ఆదాయంగా వచ్చింది. దీనితో పాటు 1,990 అమెరికా డాలర్లు, 10 ఆస్ట్రేలియా డాలర్లు, 25 ఇంగ్లాడ్స్ ఫౌండ్స్, 30 యూఏఈ దినార్స్, 2సింగపూర్ డాలర్లు ఆదాయంగా వచ్చింది. ఈ హుండీ లెక్కింపు కార్యక్రమంలో ఏఈఓలు ఎస్వీ.కృష్ణారెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి, రవీంద్రబాబు, ధనంజయ, సూపరెండెంట్‌లు కోదండపాణి, శ్రీధర్‌బాబు, కాణిపాకం యూనియన్ బ్యాంకు, ఆలయ సిబ్బంది, సేవకులు పాల్గొన్నారు.

## ముంపుకు గురైన పంటలను పరిశీలించిన అధికారులు



పిచ్చాటూరు, డిసెంబరు 6 ప్రభాతవార్త: మిచౌన్ తుఫాను కారణంగా మండలంలో జరిగిన పంట నష్టం అంచనా వేయడం కోసం బుధవారం వ్యవసాయ అధికారులు పలు గ్రామాల్లోని రైతుల వ్యవసాయ పొలాల్లో విస్తృతంగా పర్యటించి క్షేత్ర స్థాయిలో అంచనాలు తయారు చేశారు. పిచ్చాటూరు మండలంలోని నీరువాయి, రామాపురం, ఎస్ఎస్‌డీ పురం ప్రాంతాల్లో ముంపుకు గురైన వరి, వేరుశనగ, ఉద్ది, చెరకు పంటలను ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్త బి.వి.భాస్కర్‌రెడ్డి, ఆర్ఏఎస్ఎస్ వీకే ప్రధాన శాస్త్రవేత్త ఎస్.శ్రీనివాసులునాయుడు, సత్యవేడు డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు, జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి వేణుగోపాల్, మండల వ్యవసాయాధికారి సంజీవరెడ్డిలు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో వేరుశనగ, వరి పంటలు అధిక శాతం పంట నష్టం జరిగిందని, ప్రారంభ దశలో ఉన్న వరి పంటలకు కొట్టి పూర్తిగా నీళ్లు తీసి సత్వర చర్యలు చేపడితే పంటను కాపాడుకోవచ్చని సూచించారు. ముంపుకు గురైన పంటల నుంచి నీటిని వెంటనే తొలగించాలని, చిన్న వయసులో ఉన్న వేరుశనగ, ఉద్ది పంటలను ఎకరాకు 30 కేజీల యూరియా, 20 కేజీలు పొటాష్‌లను వేయాలని, చిన్న వయసులోని పంటలను నీరు తీసి వేసిన వెంటనే రోగాలు రాకుండా హెక్సారోనజోల్ ఎకరాకు 400 మి.మీ, సాఫ్ 400 గ్రాముల చొప్పున పిచికారి చేయాలని వారు తెలియజేశారు. ఈపర్యటనలో ఏడీ సుబ్రహ్మణ్యం, ఏవో సంజీవరెడ్డి, శాస్త్రవేత్తలు భాస్కర్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## నిండిన చెరువులు

విజయపురం, డిసెంబరు 6 ప్రభాతవార్త : తుపాను వల్ల కురిసిన భారీ వర్షాలకు మండలంలో చెరువులు నిండు కుండలను తలపిస్తున్నాయి. మండలంలో మొత్తం పంచాయతీరాజ్, ఇరిగేషన్ చెరువులు 42 వున్నాయి. వాటిలో మొత్తం చెరువులు పూర్తిగా నిండాయి. మండలంలో అంత సులువుగా నిండని చెరువులైన ఆలపాక కండ్రిగ, కమ్మకండ్రిగ చెరువులు కూడా నిండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## అసంపూర్తి భవనాలు..నేలపై చదువులు

**వి.కోట ఉర్దూ హైస్కూల్‌లో విద్యార్థినుల అవస్థలు!!**



వి.కోట, డిసెంబర్ 6 ప్రభాతవార్త : రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను కార్పోరేట్‌కు ధీటుగా ఏర్పాటుచేయాలని తలచి నాడు-నేడు కార్యక్రమం చేపట్టిన విషయం విదితమే. అయితే లక్షలాది రూపాయలతో చేపట్టిన పనులు పూర్తికాకపోగా విద్యార్థులు అసంపూర్తి భవనాల్లో నేలపై కూర్చుని చదువుకుంటున్నారు. ఈ దుస్థితి వి.కోట జడ్పీ ఉర్దూ హైస్కూల్‌లో నెలకొంది. నాడు-నేడులో ఈ పాఠశాల మొదటి విడత ఎంపికైంది. అయితే పనులు చేయించ డంతో హెచ్‌ఎం నిర్లక్ష్యం చూపుతున్నారని, పనులు జరగకుండానే నిధులు డ్రా చేశారనే ఆరోపణలు వస్తున్నాయి. పాతభవనంకు ఉన్న ఫ్లోరింగ్ తొలగించారు. కొత్తగా టైల్స్ వేయాల్సి ఉన్నా పనులు జరగలేదు. ఈ విషయంగా హెచ్‌ఎంను ప్రశ్నిస్తే నిధులు అప్పుడప్పుడు వస్తున్నాయని తనకు సంబంధం లేదని చెబుతున్నట్లు విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొన్నారు. కాగా ఓ అధికార పార్టీ నేత ఈ పనులు చేస్తున్నాడని తెలిసింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పాఠశాల భవనాలను విద్యార్థులకు అందుబాటులో తేవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

## పక్కా ఓటర్ల జాబితా తయారీ : జాయింట్ కలెక్టర్

చిత్తూరు, డిసెంబర్ 6 ప్రభాతవార్త: పక్కా ఓటర్ల జాబితా తయారు చేయడానికి క్షేత్ర స్థాయిలో అధికారులు చిత్తశుద్ధితో విధులు నిర్వహిస్తున్నారని జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో జెసి మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, తీసివేతలకు సంబంధించి ఈ నెల 9వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అందిన దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి 2024 జనవరి 5న ఓటర్ల జాబితా విడుదల చేస్తామన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొనే వారు పూర్తి సమాచారం ఇవ్వాలన్నారు. బిఎల్‌ఓలు గత రెండు రోజులుగా వారికి కేటాయించిన పోలింగ్ స్టేషన్లలో దరఖాస్తులు స్వీకరించడం జరిగిందని, ఈ దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో నిర్దేశించిన కాలపరిమితిలోపు పరిశీలించి పూర్తి చేస్తారన్నారు. పూర్తి సమాచారం ఇవ్వకుంటే పరిశీలన కష్టం అవుతుందని, అలాంటి క్లైములు అపరిష్కృతంగా వుంటాయన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఓ రాజశేఖర్, పరదేశి(కాంగ్రెస్), అట్లూరి శ్రీనివాసులు(బిజెపి), ఉదయ్‌కుమార్(వైకాపా), ప్రభుతేజ(తెలుగుదేశం) తదితరులు పాల్గొన్నారు.

## కార్తీక దీప దర్శనం సర్వపాపహరణం



.శ్రీకాళహస్తి, డిసెంబర్ 6 ప్రభాతవార్త : కార్తీమాసం సందర్భంగా శ్రీకాళహస్తీశ్వర్వామి ఆలయంలోని ఊంజల్‌సేవ మండపం ఎదురుగా ఆకాశదీపాన్ని శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరుతారకశ్రీనివాసులు, కార్యనిర్వహణాధికారి కెయస్.రామారావులు విచ్చేసి ఆకాశదీపాన్ని వెలిగించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ కార్తీకమాసం శివకేశవులకు ఎంతో ప్రీతిపాత్రమైందని తెలిపారు. కార్తీకదీపాన్ని దర్శించుకోవడానికి ప్రతిరోజు స్థానికులే కాకుండా వివిధ ప్రాంతాలనుంచి వచ్చే భక్తులు దర్శించునే విధంగా ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో ఆలయన ఎసి మల్లికార్జున ప్రసాద్, దేవస్థాన పాలక మండలి సభ్యులు కొండూరు సునీత, రమాప్రభ, ప్రత్యేక ఆహ్వానసభ్యులు శ్రీదేవి, ఆలయ అధికారులు టెంపుల్ ఇన్‌స్పెక్టర్ హరియాదవ్, వేదపండితులు మరియు అర్చకులు అర్ధగిరి, మరియు దేవస్థానం సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## తుఫాన్ ఎఫెక్ట్ నుండి విద్యుత్ సరఫరా పునరుద్ధరణ

**-ఎస్‌పిడిసిఎల్ సిఎండి సంతోషరావు**



తిరుపతి, డిసెంబర్ 6ప్రభాతవార్త: మిచౌంగ్ తుఫాన్‌తో అతలాకుతలమై గాలులకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిన తిరుపతి జిల్లాతో బాటు నెల్లూరుజిల్లాలో విద్యుత్ వ్యవస్థను పునరుద్ధరించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని, అధికారులు, సిబ్బంది నిర్విరామంగా కృషి చేస్తున్నారని ఎస్‌పిడిసి ఎల్ సిఎండి కె.సంతోషరావు తెలిపారు. విద్యుత్ సరఫరాను పునరుద్దరించేందుకు స్వయంగా సిఎండి సంతోష రావు గత రెండురోజులూగా నెల్లూరు జిల్లాలోనే ఉండి విద్యుత్ అధికారులు, సిబ్బందితో మమేకమై నీటిప్రవాహాన్ని లెక్కచేయకుండా పలు వరదప్రాంతాల్లో కలియతిరుగుతూ అధికారులు, సిబ్బందికి సూచనలిస్తున్నారు. వీలైనంత తక్కువ సమయంలో సరఫరాను పునరుద్దరించాలని ఆదేశించారు. భారీ వర్షాలకు సబ్‌స్టేషన్లు నీటమునగడం, విద్యుత్ స్తంభాలు, లైన్లు నేలకూలడం, పలుచోట్ల వంతెనలు కూలిపోవడంతో శాశ్వత ప్రాతిపకదిన మరమ్మతులు చేపడుతున్నామన్నారు. లైన్లు లాగలేని ప్రాంతాల్లో కేబుళ్ళను ఏర్పాటుచేసి తాత్కాలికంగా విద్యుత్‌ను సరఫరా చేసేందుకు చూస్తున్నామన్నారు. బుధవారం సాయంత్రానికి 11.27లక్షల విద్యుత్ సర్వీసులు, 42వేల విద్యుత్ సర్వీసులకు సరఫరాను పునరుద్ధరించడం జరిగిందని సిఎండి తెలిపారు.


వార్త

ప్రభాతవార్తకు విలేకరులు కావలెను

తెలుగు దిన పత్రికా రంగంలో అందరి మన్ననలు పొంది పాఠకుల హృదయాలను దోచుకున్న వార్త దిన పత్రిక నందు విలేకర్లుగా పనిచేయుటకు ఉత్సాహవంతులైన యువతీ యువకులు కావలెను.

కావలసిన సెంటర్లు

తిరుపతి ప్రెస్‌క్లబ్, తిరుపతి ఎడ్యుకేషన్, తిరుపతి జిల్లా కలెక్టరెట్, తిరుచానూరు, చిత్తూరు టౌన్, చిత్తూరు జిల్లా కలెక్టరేట్, పలమనేరు, పుంగనూరు, పాలసముద్రం, నాయుడుపేట, ఓజిలి కేంద్రాల్లో పనిచేయుటకు.

మీ పూర్తి బయోడేటాతో...

వారం రోజుల లోపు ఈ క్రింది అడ్రస్సును సంప్రదించగలరు.

వార్త కార్యాలయం, మూడవ మైలురాయి, రేణిగుంటరోడ్డు, తిరుపతి. సెల్: 9848131880